క్లుప్తంగా

శాకంబరిగా వనువులమ్మ



శాకంబరి అలంకరణలో వనువులమ్మ

కడియం: బుర్రిలంక గ్రామ దేవత వనువులమ్మ శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కడియం: బాలికలు, మహిళల రక్షణకు ఏర్పాటు చేసిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ ఏసీడీపీవో టి.కనకవల్లి అన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కడియపుసావరం క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కనకవల్లి మాట్లాడుతూ మహిళల రక్షణ, హక్కులకు సంబంధించిన చట్టాలను వివరించారు. బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా వల్ల కలిగే దుష్పరిణామాలను, అందుకు బాధ్యులైన వారిపై చట్టరీత్యా తీసుకునే చర్యలను వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పథకాలను తెలియజేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు ఈ.సునీత, జి.నాగజ్యోతి, జి.పద్మావతి, చిన్నారి, సత్యభామ పాల్గొన్నారు.

బాలికల సంరక్షణకు సమష్టి కృషి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అచ్చియమ్మ

రాజమహేంద్రవరం సిటీ: బాలికల హక్కులను పరిరక్షించడంలో అందరూ భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జి.అచ్చియమ్మ అన్నారు. ఆనంద నగర్ సెక్టార్ పరిధిలోని ఆర్యాపురం అంగన్ వాడీ సెంటర్‌లో శుక్రవారం బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, పోక్సో తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎమ్‌లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'మిస్ రాజమహేంద్రవరం' ప్రోగ్రామ్ వాయిదా

రాజమహేంద్రవరం సిటీ: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన మిస్ రాజమహేంద్రవరం ప్రోగ్రామ్ వాయిదా పడింది. స్థానిక వేంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో శనివారం ఈ కార్యక్రమం జరుపుతామని గతంలో నిర్వాహకులు ప్రకటించారు. అయితే భారీ వర్షాల కారణంగా వాయిదా వేసినట్టు శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు ఇమ్మని వెంకట్, సెక్రటరీ సురేష్ ఉదయగిరి, చార్టర్ అధ్యక్షుడు తీగెల రాజా తెలిపారు. పోటీని ఎప్పుడు నిర్వహించేదీ తెలియజేస్తామన్నారు.

లింగ నిర్ధారణ కోసం స్కానింగ్ చేస్తే చర్యలు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్‌బాబు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): లింగ నిర్ధారణ కోసం స్కానింగ్ చేయడం నేరమని, అలాంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు హెచ్చరించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం 1994 (పీసీఅండ్‌పీఎన్‌డీటీ యాక్ట్ 1994)పై శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భంలోని బిడ్డ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు, జన్యుపరమైన, ఇతర లోపాలను తెలుసుకునేందుకు మాత్రమే రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న కేంద్రాలు ఈ పరీక్షలు చేయాలన్నారు. ఈ చట్టాన్ని సరైన విధంగా అమలు చేసేందుకు సంబంధిత అధికారులు తరచుగా స్కానింగ్ కేంద్రాలలో తనిఖీలు నిర్వహించాలన్నారు. స్కానింగ్ కేంద్రాల ఆవరణలో ఈ చట్టం గురించి ప్రజలకు అవగాహన కలిగేలా పోస్టర్లు అతికించాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఇతర వైద్య సిబ్బంది ప్రజలకు ఈ విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎవరికి ఎలాంటి న్యాయ సందేహాలున్నా జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించి వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీహరి బాబు, డిప్యూటీ డీఈఎంఓ డాక్టర్ ఎస్.సత్య కుమార్ పాల్గొన్నారు.

ఆగని వాన.. వీడని ముంపు

- నీట మునిగిన వరినాట్లు
- నర్సరీల్లోకి చేరిన నీరు



కడియం ఆవలో ముంపు పొలాలను పరిశీలిస్తున్న ఏఈవో ద్వారకాదేవి



నర్సరీలోకి చేరిన ముంపునీరు

కడియం: వర్షం ఎక్కడా ఆగడం లేదు. రాత్రీ పగలూ తేడా లేకుండా పడుతూనే ఉంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం శుక్రవారం కూడా కొనసాగింది. విరామం లేకుండా పడుతున్న వాన కారణంగా ఎక్కడికక్కడే ముంపు నీరు చేరిపోయింది. పల్లపు ప్రాంతాలను చుట్టుముట్టేసింది. ముంపునీటిని బయటకు పంపేందుకు వివిధ శాఖల సిబ్బంది చర్యలు చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. వీడవకుండా వర్షం పడుతుండడంతో ముంపునీరు తగ్గడం లేదు.

1,246 ఎకరాల మునక

మండలంలోని వేమగిరి, కడియం, జేగురుపాడు, మాధవరాయుడుపాలెం, మురమండ, దుళ్ల తదితర గ్రామాల్లోని 1,246 ఎకరాల్లో వరినాట్లు నీట మునిగాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇటీవలే ఊడ్పులు పూర్తయిన నేపథ్యంలో మూనలు తేలిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి నీటిలోనే పూర్తిగా మునిగిపోతే వేసిన నాట్లు చనిపోతాయంటున్నారు. నాట్లు కనిపించకుండా ముంపు నీరు ఉండడంతో వాటిని రక్షించుకునేందుకు చర్యలు చేపట్టడానికి కూడా అవకాశం లేదంటున్నారు. నీరు పూర్తిగా తగ్గిన తరువాతే సస్యరక్షణ చర్యలు చేపట్టడానికి అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కడియం ఆవ ప్రాంతంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి తమ సిబ్బందితో ముంపు పొలాలను పరిశీలించారు.

నర్సరీ మొక్కలు సైతం..

మండలంలోని వేమగిరి, వెంకాయమ్మపేట, బుర్రిలంక, కడియపులంక, పొట్టిలంక, దుళ్ల, వీరవరం, దామిరెడ్డిపల్లి, కడియపుసావరం, జేగురుపాడు, మురమండ గ్రామాల్లో విస్తరించి ఉన్న నర్సరీల్లోని మొక్కల మధ్యకు కూడా నీరు చేరిపోయింది. సుమారు రెండు అడుగుల ఎత్తు మేర ముంపు నీరు కనిపిస్తోందని నర్సరీ రైతులు చెబుతున్నారు. ఎక్కడికక్కడే ముంపునీరు బయటకు పోయేందుకు ఏర్పాటైన మురుగు కాలువలు ఆక్రమణలకు గురికావడం కారణంగా ముంపు నీరు బయటకు వెళ్లడం లేదని చెబుతున్నారు. వర్షాలు ఇంకా కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో నర్సరీ మొక్కలకు సైతం ఇబ్బందులు తప్పవన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఎగుమతుల సీజన్ ముమ్మరంగా మొదలైంది. గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడం, ఎగుమతికి తగిన పరిస్థితులకు లేకపోవడంతో మొక్కల అమ్మకాలు స్తంభించాయి. వీటిపై ఆధారపడిన కూలీలకు సైతం పనులు లేకుండా పోయాయి.



నీట మునిగిన వరి చేలు

ముంపు బాధితులకు పునరావాస కేంద్రాలు



నగరంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్



తొర్రేడులో నీట మునిగిన వరిచేలు

రాజమహేంద్రవరం సిటీ: అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన సందర్భంలో నివాసితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశించారు. నగరంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో శుక్రవారం లోతట్టు ప్రాంతాలైన డీలక్స్ సెంటర్, హైటెక్ బస్టాండ్, కంబాలచెరువు, ఆర్యాపురం, కృష్ణా నగర్, ఆల్కాట్ గార్డెన్స్ ఏరియాలతో పాటు నల్లా చానల్, రాతి చానల్ కాలువలను ఆయన పరిశీలించారు. నల్లా చానల్ పంపింగ్ స్టేషన్, ఎస్‌ఆర్‌సీసీ పంపింగ్ స్టేషన్లను తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నిరంతరం మోటార్ల ద్వారా వర్షపు నీటిని పంపింగ్ చేయాలని, అవసరమైతే అదనపు మోటార్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పందిరి మహాదేవుడు సత్రం, ఆల్కాట్ గార్డెన్స్, మున్సిపల్ కల్యాణ మండపంతో పాటు వివిధ స్కూళ్లలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, అక్కడ సహాయ బృందాలను నియమించామన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో 24 గంటలూ పనిచేసేలా కంట్రోల్ రూము ఏర్పాటు చేశామని, ప్రజలు ఏదైనా సమస్య ఉంటే 94940 60060 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. గోదావరి నీటి మట్టం పెరిగితే లంకల్లోని వారిని కూడా పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్నారు. ఆయన వెంట అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, మున్సిపల్ ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎ.వినూత్న తదితరులు ఉన్నారు.

286 హెక్టార్లలో వరిపంట మునక

రాజమహేంద్రవరం రూరల్: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు రూరల్ మండలంలో 286 హెక్టార్ల వరిపంట నీట మునిగింది. మండలంలో 1,363 హెక్టార్లలో వరి పంట వేశారు. కాతేరు, తొర్రేడు గ్రామాల్లో పంట బోదెలలో పూడిక తీయకపోవడంతో పొలాలు ముంపు బారిన పడ్డాయి. రాజవోలు గ్రామంలో ఆవ ప్రాంతంలో వరిచేలు నీటమునిగాయి. హుకుంపేటలోని కాపుల వీధిలో పాత పెంకుటిల్లు గోడకూలి ద్విచక్ర వాహనం దెబ్బతింది. మండలంలోని పలు పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. నీటమునిగిన వరిచేలు, పల్లపు ప్రాంతాలను తహసీల్దార్ వైకేవీ అప్పారావు, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి భీమరాజు, సిబ్బంది పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం సిటీ: ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ ఎన్నికలను శనివారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన భద్రత, రక్షణ ఏర్పాట్లు చేసినట్టు ఎస్పీ నరసింహ కిశోర్ తెలిపారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. కందుకూరి వీరేశలింగం ఆస్తిక ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో పోలింగ్ కేంద్రాల వద్ద చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. సంబంధిత అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎస్పీ వెంట డీఎస్పీలు డి.ప్రభాకర్, విజయపాల్, ఇన్‌స్పెక్టర్లు సూరి అప్పారావు, పుల్లారావు, వీరయ్య గౌడ్ ఉన్నారు.

రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న నాయకులు

మధురపూడి: రాజమహేంద్రవరం ఏరియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక శుక్రవారం కోరుకొండలోని ఆదిత్య ఫంక్షన్ హాలులో నిర్వహించారు. రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం, రాజానగరం, కోరుకొండ, గోకవరం మండలాలతో ఇటీవల ఈ సంఘాన్ని ఏర్పాటు చేశారు. వీరందరూ గతంలో అనపర్తి అసోసియేషన్‌తో కలిసి ఉండేవారు. రాజమహేంద్రవరం ఏరియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వల్లేపల్లి శ్రీనివాసు, ఉపాధ్యక్షుడిగా లంక ఆదినారాయణ, కార్యదర్శిగా బీశెట్టి గణపతి, సంయుక్త కార్యదర్శిగా చలంచర్ల కిశోర్, కోశాధికారిగా కంచర్ల సూర్యప్రకాశ్‌లతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తమ అసోసియేషన్ తరఫున రైతులకు అన్ని విధాలుగా సహకారం అందజేస్తామన్నారు. గతంలో సుదూర ప్రాంతాలకు ధాన్యాన్ని తరలించాల్సి రావడంతో రైతులు ఇబ్బంది పడేవారన్నారు. ఇక నుంచి ఆ ఇబ్బంది లేకుండా స్థానిక రైస్ మిల్లుల యజమానులు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సీతానగరం, రాజానగరం, కోరుకొండ, గోకవరం మండలాల రైస్‌మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ వసుంధర

రాజానగరం: వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్.వసుంధర సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఓపీ, ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న ఈ సమయంలో అతిసార, సీజనల్ జ్వరాలు వ్యాపించేందుకు అవకాశం ఉందన్నారు. ఇటువంటి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రావుల చెరువు గట్టు వీధిలో నీటి క్లోరినేషన్ పరీక్షను స్వయంగా పర్యవేక్షించారు. సుబ్బారావు కాలనీలో లెప్రసీ సర్వేను కూడా పరిశీలించిన ఆమె ప్రతి నెలా 10, 11వ తేదీలలో లెప్రసీ డీపీఎంఆర్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ

పెదపూడి: ద్విచక్ర వాహన ప్రయాణికులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వారి జీవితానికి భద్రత కల్పించుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి రెడ్డి ప్రసన్న అన్నారు. అనపర్తి జూనియర్ సివిల్ కోర్టులో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. అనంతరం గ్రామంలోని మెయిన్ రోడ్డులో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి, ప్రజలకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మూర్తి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిద్ధార్థ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షణ్ముఖరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ భాస్కరరావు సెక్రటరీ రమణమూర్తి, కోర్టు, బార్ సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరం... అర్బన్ బ్యాంక్ సమరం

- నేడు 'ఆర్యాపురం' ఎన్నికలు
- అవినీతి కట్టడే అస్త్రంగా నందెపు ప్యానెల్
- అభివృద్ధి చేస్తామంటున్న చల్లా బృందం



రాజమహేంద్రవరంలో ఆర్యాపురం అర్బన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం

రాజమహేంద్రవరం సిటీ: వందేళ్ల పైబడి చరిత్ర కలిగిన ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. దశాబ్ద కాలం తరువాత శనివారం జరగబోతున్న ఎన్నికల్లో గెలుపు కోసం రెండు ప్యానెళ్ల సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. బ్యాంక్ పాలకవర్గ ఎన్నికలు పార్టీ రహితంగా జరిగేవే అయినప్పటికీ రాజకీయ పార్టీలు తెరవెనుక కీలక పాత్ర పోషిస్తుంటాయి. ఈసారి ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ, తెలుగుదేశం పార్టీలు ప్యానెళ్లకు మద్దతుగా నిలవడంతో ఎన్నికలు ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి.

ముమ్మర ప్రచారం

రాజమహేంద్రవరంలో పేరెన్నికగన్న వెంకటేశ్వరా హోల్‌సేల్ మార్కెట్ చైర్మన్‌గా పనిచేసిన నందెపు శ్రీనివాస్ ఒక ప్యానెల్‌కు, మాజీ చైర్మన్ చల్లా శంకరరావు మరో ప్యానెల్ నుంచి బరిలోకి దిగారు. శంకరరావు హయాంలో బ్యాంక్‌లో జరిగిన అక్రమాల కట్టడే అజెండాగా నందెపు శ్రీనివాస్ ప్యానెల్ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. వైఎస్సార్ సీపీ మద్దతు ఇస్తున్న నందెపు శ్రీనివాస్‌కు నగరంలో పలు రంగాల ప్రముఖుల అండగా ఉంది. అలాగే శంకరరావుకు కూటమి మద్దతు పలుకుతోంది. గడచిన వారం రోజులుగా ఇరు పక్షాలు ముమ్మరంగా ప్రచారాన్ని నిర్వహించాయి.

హోరాహోరీ..

2013లో జరిగిన ఎన్నికలలో చల్లా శంకరరావు గెలుపొందారు. 2014– 2018 మధ్య బ్యాంక్ పాలకవర్గ చైర్మన్‌గా వ్యవహరించారు. నాడు రాజమహేంద్రవరం నగరంలో పలువురు ప్రముఖులు తోడ్పాటుతో శంకరరావు విజయాన్ని అందుకున్నారు. కాంగ్రెస్, ఆ తరువాత పీఆర్పీ, తెలుగుదేశం.. ఇలా పార్టీలు మారుతూ వచ్చిన శంకరరావు రెండోసారి ఈ బ్యాంక్ చైర్మన్‌కు పోటీపడుతున్నారు. ఈసారి ఆయనకు నందెపు శ్రీనివాస్ గట్టి పోటీ ఇస్తున్నారు. శ్రీనివాస్‌కు బ్యాంక్ సభ్యులు, పలువురు ప్రముఖులు మద్దతు బలంగా ఉండటంతో శంకరరావు గట్టి పోటీని ఎదుర్కొంటారని రాజకీయ నేతలు విశ్లేషిస్తున్నారు.

శంకరరావు హయాంలో అవినీతి మచ్చ

పాలకవర్గ చైర్మన్‌గా శంకరరావు హయాంలో వెలుగులోకి వచ్చిన పలు అవినీతి, అక్రమాలు అప్పట్లో పెనుదుమారాన్నే రేపాయి. ఫిక్సిడ్ డిపాజిట్ల ఉపసంహరణ, కొందరు అధికారులపై ఫిర్యాదులు, జాతీయ రహదారిలో నిర్మించిన మహాలక్ష్మి మార్కెట్‌లో కొందరికి ఆయాచిత లబ్ధి చేకూర్చారనే ఆరోపణలు, నాలుగు దుకాణాలను బినామీ పేర్లతో కొందరికి లబ్ధి చేకూర్చడం, స్థలాలు కొనుగోలు, భవనాల నిర్మాణం పేరుతో బ్యాంక్ నిధులు దారి మళ్లించిన వ్యవహారాలు అప్పట్లో సంచలనమయ్యాయి. ఆ నేపథ్యంలోనే శంకరరావు పార్టీలు ఫిరాయించారని స్థానిక రాజకీయాల్లో చక్కర్లు కొట్టింది. ఆర్థిక అవకతవలపై తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగానే శంకరరావు పాలకవర్గంపై కోఆపరేటివ్ చట్టంలో అత్యంత కీలకమైన 51 విచారణకు ఆదేశించడం ఇప్పటికీ బ్యాంక్ సభ్యులు గుర్తు చేస్తున్నారు. ఈ వ్యవహారాల్లో సుమారు రూ.5 కోట్లకు పైగా జరిమానా విధించటంతో న్యాయస్థానం నుంచి స్టే తెచ్చుకున్నారు.

గెలుపుపై నందెపు ధీమా

ఈ అవినీతి వ్యవహారాలు కొనసాగుతున్న తరుణంలో శంకరరావు చైర్మన్ గిరీ కోసం మరోసారి బరిలోకి దిగడం బ్యాంక్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. శంకరరావుకు పోటీగా వైఎస్సార్ సీపీ నేతలు బలపరిచిన నందెపు శ్రీనివాస్, అతని 10 మంది ప్యానెల్‌తో గట్టి పోటీ ఇస్తున్నారు. ప్రస్తుతం రూ.680 కోట్లు ఉన్న బ్యాంక్ డిపాజిట్లు రెట్టింపు చేస్తామని నందెపు ప్యానెల్ సభ్యులకు హామీ ఇచ్చింది. ఎన్‌పీఏను తగ్గించి బ్యాంక్‌ను సాఫ్ నుంచి బయటకు తీసుకువస్తామని చెప్పడంతో సభ్యుల మనసు చూరగొనే ప్రయత్నం చేశారు. వాటాదారులకు 15 శాతం డివిడెండ్ అందిస్తామని మరో కీలకమైన హామీ కూడా నందెపు ప్యానెల్ ఇచ్చింది. ఆర్యవైశ్య ప్రముఖుడు శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావుతో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వెన్నంటి నిలవడంతో నందెపు ప్యానెల్ గెలుపు పై ధీమాతో ఉంది.

బ్యాంక్ చరిత్ర

ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌కు 105 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ అర్బన్ బ్యాంకు పరిధిలో 16 బ్రాంచ్‌లున్నాయి. వాటిలోని 11 డైరెక్టర్ల పదవులకు ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్నాయి. 74,585 మంది ఖాతాదారులైన ఓటర్లు ఓటు హక్కు కలిగి ఉన్నారు. రాజమహేంద్రవరం పరిధిలోని 8 బ్రాంచ్‌లలో 70,519 మంది ఓటర్ల కోసం 48 పోలింగ్ కేంద్రాలను ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీ, ఎస్‌కేవీటీ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ ప్రాంగణాల్లో ఏర్పాటు చేశారు. దివాన్ చెరువు, భీమవరం, అమలాపురం, విశాఖపట్నం సీతమ్మధార, గుంటూరు బ్రాంచ్‌ల పరిధిలో 4,066 మంది తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎక్కడికక్కడే పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం ఓట్ల బాక్సులను రాజమహేంద్రవరం తీసుకువస్తారు. ఆదివారం లెక్కింపు జరుగుతుంది.

నీతిమంతమైన పాలనే అజెండా



105 ఏళ్ల చరిత్ర కలిగిన ఆర్యాపురం బ్యాంక్‌పై అవినీతి మచ్చపడింది. ఆ మచ్చను తొలగించి దేశంలోనే అగ్రగామి బ్యాంక్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మా ప్యానల్ పనిచేస్తుంది. ఈ ఎన్నికల్లో మా ప్యానల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నాను. నాడు జరిగిన అవకతవకలు కారణంగానే 51 ఎంక్వయిరీ వేసి రూ.5 కోట్ల 62 లక్షల పెనాల్టీ విధించారు. శంకరరావు హయాంలో బ్యాంక్ సి గ్రేడ్‌లోకి పోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వేసిన కమిటీ కృషితో ప్రస్తుతం బి గ్రేడ్‌లోకి వచ్చింది.

– నందెపు శ్రీనివాస్, చైర్మన్ అభ్యర్థి

బ్యాంక్‌ను మరింత అభివృద్ధి చేస్తా



చైర్మన్‌గా గెలిపిస్తే ఆర్యాపురం బ్యాంకును మరింత అభివృద్ధి చేస్తాను. ప్రధాన కార్యాలయాన్ని కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దాను. బ్యాంకు బ్రాంచ్‌లకు నూతన భవనాలు అందుబాటులోకి తెచ్చి, స్థిర చరాస్తులు కూడబెట్టాను. బ్యాంకులో ఏ నిర్ణయాలు తీసుకున్నా సీఈవోదే బాధ్యత. సభ్యులం అమలు చేయమని మాత్రమే చెబుతాం. బ్యాంక్ లావాదేవీల్లో తప్పు చేయలేదు నిరూపించడానికి సిద్ధంగా ఉన్నాను.

– చల్లా శంకరరావు, మాజీ చైర్మన్, అభ్యర్థి

మర్యాదపూర్వకంగా...

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేషన్‌ను రాజమహేంద్రవరంలోని ఆయన నివాసంలో జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే జిల్లా కోర్టు ఆవరణలో ప్రధాన న్యాయమూర్తి గంధం సునీతను కలెక్టర్ పి.ప్రశాంతి మర్యాద పూర్వకంగా కలిసి, పూలమొక్క అందజేశారు.



మంత్రి దుర్గేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్



జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీతకు పూలమొక్క అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

లింగ వివక్ష సరికాదు

రాజానగరం: మహిళలు అన్ని రంగాలలో పురుషులతో పోటీ పడుతున్నారని, ఈ తరుణంలో కూడా లింగవివక్ష చూపడం దారుణమని ఐసీడీఎస్ సీడీపీఓ టి.నాగమణి, వన్ స్టాప్ సెంటర్ సైకాలజిస్టు, కౌన్సెలర్ వైష్ణవి అన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం – 2లో శుక్రవారం నిర్వహించిన బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో ఆడపిల్లల సంరక్షణ, ఆవశ్యకతను తెలియజేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం పీవీవీ భీమేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో పురుషుల కంటే మహిళల సంఖ్య తక్కువగా ఉందని, ఇది దేశ ప్రగతి, సమాజాభివృద్ధికి మంచిది కాదన్నారు.